సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 5 । డిసెంబర్ । 2024



భూప్రకంపనలు
ఉమ్మడి పశ్చిమలో పలుచోట్ల బుధవారం భూప్రకంపనలు సంభవించాయి. కొన్నిచోట్ల జనం ఇళ్లల్లో నుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. 4లో ▸



బాదుడే ఎక్కువ
కూటమి ప్రభుత్వంలో విద్యుత్ బిల్లుల బాదుడుతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే చార్జీలు దారుణంగా పెంచేశారు. 4లో ▸



ఘంటసాల చరితం అజరామరం
ప్రముఖ గాయకుడు ఘంటసాల 102వ జయంతి సందర్భంగా ఏలూరులో సంగీత గానామృత లహరి కార్యక్రమం అత్యంత వేడుకగా నిర్వహించారు. 4లో ▸

న్యూస్‌రీల్

విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

భీమవరం: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా 5న విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి కలెక్టర్‌ను కోరారు. బుధవారం భీమవరం కలెక్టరేట్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి వినతి పత్రం అందచేశారు. అనంతరం గోపీమూర్తి మాట్లాడుతూ ఓటర్లు ఉన్న విద్యాసంస్థలకు సెలవు ప్రకటించి ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఐటీఐలో స్వల్పకాలిక శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్ కోర్సుకు నూ స్వల్పకాలిక శిక్షణ ఇచ్చి అనంతరం ఉపాధి కల్పించేలా కార్యాచరణ రూపొందించినట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పీ రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 8 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పించేందుకు కొన్ని పరిశ్రమల యాజమాన్యాలతో ఐటీఐ కాలేజీ ఒప్పందం చేసుకుందన్నారు. పదో తరగతి ఆపైన చదువుకున్న ఖాళీగా ఉన్న అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని, వయసు 30 సంవత్సరాలు లోపు వుండాలన్నారు. 10వ తరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డు నకలుతో రిజిస్ట్రేషన్ చేస్తారని, ఇతర వివరాలకు 8978524022 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపు కళా ఉత్సవ్ ఎంపిక పోటీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పాఠశాలల విద్యా డైరెక్టర్ ఆదేశాల మేరకు కళా ఉత్సవ్ 2024–25లో భాగంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో 9 నుంచి 12 వరకూ చదువుతున్న విద్యార్థులకు జిల్లా స్థాయిలో వివిధ కళాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు దూబచర్ల డైట్ కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.కమల కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక పోటీలు ఈ నెల 6న దూబచర్లలోని డైట్ కళాశాలలో జరుగుతాయన్నారు. గాత్ర సంగీతం, వాద్య సంగీతం, నృత్యం, నాటక రంగం, దృశ్య కళలు, సంప్రదాయ కథ చెప్పడం వంటి అంశాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంట్రీల నిమిత్తం ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9951817359 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

రైస్ మిల్లుల తనిఖీ



పూలపల్లిలో రైతుతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి

పాలకొల్లు అర్బన్: మిల్లుకి వచ్చిన ధాన్యాన్ని త్వరగా దిగమతి చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. పాలకొల్లు, పోడూరు మండలాల్లోని పలు రైస్‌మిల్లులను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, కంప్యూటర్ డేటాను పరిశీలించారు. రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. మధ్యవర్తుల ప్రమేయంతో మోసపూరిత మాటలు చెబితే నమ్మవద్దన్నారు. పూలపల్లి రంగరాజు రైస్‌మిల్లు వద్ద రైతులతో జేసీ మాట్లాడారు. సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని సూచించారు. కల్లాల నుంచి మిల్లుకి తరలించడంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే చెప్పాలని కోరారు. పోడూరు జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్‌ను జేసీ పరిశీలించారు. పోలింగ్ నిర్వహణకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా తీసుకున్న చర్యలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ముగిసిన పాలిటెక్నిక్ ఫెస్ట్

తాడేపల్లిగూడెం: ప్రాంతీయ స్థాయి పాలిటెక్నికల్ ఫెస్ట్ బుధవారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ముగిసింది. రెండ్రోజుల పాటు సాగిన ఈ ఫెస్ట్‌లో వివిధ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి 11 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 123 మంది విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు. వివిధ బ్రాంచిలకు చెందిన విద్యార్థులు 49 ప్రాజెక్టులను ఎగ్జిబిషన్‌లో ఉంచారు. వీటిలో ఉత్తమమైన 17 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి.

స్పెషల్ లీవ్ మంజూరు

భీమవరం (ప్రకాశంచౌక్): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులందరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని డిసెంబర్ 5న స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను ప్రభుత్వం ప్రకటించినట్లు ఎమ్మెల్సీ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు.

రహదారిద్ర్యం
- రోడ్ల అభివృద్ధికి సర్కారు కుప్పిగంతులు
- రోడ్లు బాగుచేస్తామంటూ హడావుడి
- కూటమి పాలన చేపట్టి ఆరు నెలలైనా కలగని మోక్షం
- 181 రోడ్ల మరమ్మతులకు రూ.42.57 కోట్ల మంజూరు
- 155 పనులకు టెండర్ల ఖరారు
- మొదలుపెట్టినవి కేవలం 42 పనులే..
- 15 శాతం మాత్రమే పూర్తయిన మరమ్మతులు

కళ్లకు గంతలు.. కనిపించవా గుంతలు



భారీ గోతులతో ఇరగవరం-ఏలేటిపాడు రోడ్డు



మరమ్మతులకు నోచుకోక ప్రమాదభరితంగా వీరవాసరం-బ్రాహ్మణచెరువు రోడ్డు

సాక్షి, భీమవరం: అధికారంలోకి రావడమే ఆలస్యం రోడ్లను అద్దంలా మార్చేస్తామన్నారు.. ఎక్కడా గుంతలన్నవే లేకుండా చేస్తామంటూ కూటమి నేతలు హామీలు గుప్పించారు.. పాలన చేపట్టి ఆరు నెలలు కాగా మరమ్మతుల పేరిట చేపట్టిన పనులు పూర్తిచేయక ముఖం చాటేస్తున్నారు. అధ్వానంగా తయారైన రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు అగచాట్లు పడుతున్నారు.

చేతులెత్తేసిన కూటమి

రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం మరమ్మతులు చేసేందుకు నిర్ణయించింది. ప్యాచీ వర్కులు, అత్యవసర మరమ్మతుల పేరిట జిల్లాలోని స్టేట్ హైవే (ఎస్‌హెచ్) రోడ్లలో రూ.10.45 కోట్ల విలువైన 41 పనులు, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్ల (ఎండీఆర్)లో రూ.32.12 కోట్ల విలువైన 140 పనులు మంజూరు చేసింది. వీటిలో తణుకు-భీమవరం, చేబ్రోలు-ఉండి, కాళీపట్నం-భీమవరం, భీమవరం-గుడివాడ తదితర 50కు పైగా రోడ్లలో 698 కిలోమీటర్లు మేర మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. సంక్రాంతి నాటికి రోడ్లుపై ఎక్కడా గుంతలన్నవే లేకుండా చేస్తామని ప్రకటించగా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మొత్తం 181 పనులకు గాను ఇప్పటివరకు 155 పనులకు టెండర్లు ఖరారవ్వగా వీటిలో మొదలుపెట్టినవి కేవలం 42 పనులు మాత్రమే. ఇంకా 109 పనులు ప్రారంభం కావాల్సి ఉంది. మరో 26 పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో అధికారులు రీటెండర్లు పిలిచే పనిలో ఉన్నారు.

ముందుకు సాగని పనులు

రాష్ట్ర రహదారుల్లో 160 కిలోమీటర్లు మేర, జిల్లా ప్రధాన రోడ్లలో 538 కిలోమీటర్లు మేర మరమ్మతులు చేయాల్సి ఉంది. కాగా ఇప్పటివరకు కేవలం 15 శాతం మేర మాత్రమే పనులు పూర్తి చేయడం గమనార్హం. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు యాక్షన్‌ప్లాన్ అంటూ హడావుడి చేస్తుందే తప్ప పనులు ముందుకు సాగడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో జనవరి నాటికి మరమ్మతులు పూర్తి కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కనీస మరమ్మతులు పూర్తిచేసేందుకు సర్కారు పిల్లి మొగ్గలు వేస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. గుంతలు పూడుస్తున్నామంటూ గతంలో రోడ్లపైకి వచ్చి హడావుడి చేసిన కూటమి నేతలు ఇప్పుడు నోరుమెదపడం లేదు. గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడిక్కడ రోడ్లు అధ్వానంగా తయారవ్వడంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు.

గత ప్రభుత్వంలో పెద్దపీట

గత ప్రభుత్వంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎక్కడికక్కడ గ్రామాలు, కాలనీల్లోని రోడ్లను అభివృద్ధి చేసింది. రూ.36 కోట్లతో తాడేపల్లిగూడెంలోని కోడేరు-నల్లజర్ల (కేఎస్ రోడ్డు)ను నాలుగు లైన్లుగాను అభివృద్ధి చేయగా రూ.15 కోట్లతో భీమవరం-గరగపర్రు, రూ.5 కోట్లతో భీమవరం-గొల్లవానితిప్ప రోడ్డు, రూ.4 కోట్లతో పెనుగొండ-మార్టేరు రోడ్డును అభివృద్ధి చేశారు. రూ.26 కోట్లతో తణుకు-అత్తిలి రోడ్డు, రూ.18 కోట్లతో పెనుగొండ-ములపర్రు రోడ్డు, రూ.25 కోట్లతో పాలకొల్లు-మార్టేరు రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారు. ఇలా కోట్లాది రూపాయలు వెచ్చించి జిల్లాలోని పలు రోడ్లను అభివృద్ధి చేశారు.

జిల్లాలో రోడ్ల మరమ్మతుల వివరాలు

నియోజకవర్గం	పనులు	కిలో మీటర్లు	నిధుల మంజూరు (రూ.కోట్లలో)
భీమవరం	29	77.42	8.61
ఉండి	39	151.88	12.25
పాలకొల్లు	18	73.59	3.64
ఆచంట	25	97.38	3.33
తాడేపల్లిగూడెం	29	142	6.9
నరసాపురం	15	55	2.97
తణుకు	14	56.8	2.35
ఉంగుటూరు మండలం	12	43.9	2.52



అధ్వానంగా ఉన్న మొగల్తూరు రోడ్డు

ఎక్కడికక్కడ అధ్వానంగా..



ఎక్కడికక్కడ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడాల్సి వస్తోంది. త్వరితగతిన రోడ్లు మరమ్మతుల పనులు చేపట్టి పూర్తి చేసేందుకు ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలి.

–గుండా బత్తుల సుబ్బారావు, ఉండి

గుంతలు పూడ్చడం లేదు



అధికారంలోకి వస్తే రోడ్లను అద్దంలా చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి ఇప్పుడు మరమ్మతులు మాత్రమే చేస్తామంటున్నారు. కనీసం ఆ పనులు కూడా మొదలుపెట్టలేదు. నరసాపురం మండలంలో ఎస్‌హెచ్-216తో పాటు గ్రామాల రోడ్లు ఛిద్రంగా ఉన్నాయి.

– మేడిది ప్రభాకర్, మల్లవరంలంక

డ్రోన్ వివాదంలో చర్యలేవీ ?

- యూట్యూబర్‌పై నెపం
- నోరు మెదపని శ్రీవారి ఆలయ అధికారులు



శ్రీవారి క్షేత్రాన్ని డ్రోన్ కెమెరాతో తీసిన ఫొటో

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో ఇటీవల చోటుచేసుకున్న డ్రోన్ వివాదంలో భద్రతా వైఫల్యంపై ఇంతవరకు అధికారులు చర్యలు తీసుకోలేదు. డ్రోన్ కెమెరాతో క్షేత్రాన్ని చిత్రీకరించిన యూట్యూబర్‌పై కేసు పెట్టిన ఆలయ అధికారులు, తమ సెక్యూరిటీ విభాగం వైఫల్యాన్ని కప్పిపుచ్చుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రాన్ని ఒక యూట్యూబర్ ఈ ఏడాది ఆగస్టు నెల చివరిలో డ్రోన్ కెమెరాతో చిత్రీకరించాడు. ఆ వీడియోలను తన యూట్యూబ్ చానల్, సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఇవి కాస్తా వైరల్ కావడంతో ఈ నెల 1న దీనిపై పెద్ద ఎత్తున దుమారం రేగింది. దాంతో స్థానిక తహసీల్దార్ జీవీ సుబ్బారావు అదేరోజు ఈ ఘటనపై విచారణ జరిపి, ఆలయ భద్రతను మరింతగా పెంచాలని ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. దేవస్థానం ఏఈఓ ఫిర్యాదు మేరకు ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, ఊటుకూరు గ్రామానికి చెందిన యూట్యూబర్ వన్నెంరెడ్డి హరినాథ్‌పై ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ కేసు నమోదు చేశారు.

సెక్యూరిటీ పనితీరు ప్రశ్నార్థకం

యూట్యూబర్‌పై దేవస్థానం అధికారి చేసిన ఫిర్యాదులో 'డ్రోన్ కెమెరాతో క్షేత్రాన్ని చిత్రీకరించడం వల్ల ఆలయ భద్రతకు విఘాతం కలిగే అవకాశం ఉందని' పేర్కొన్నారు. అసలు దేవస్థానం సెక్యూరిటీ విభాగం సక్రమంగా పనిచేసి ఉంటే ఈ విఘాతానికి ఆస్కారమే ఉండేది కాదని పలువురు అంటున్నారు. డ్రోన్ కెమెరాతో క్షేత్రాన్ని చిత్రీకరించిన విషయం దేవస్థానం సెక్యూరిటీ విభాగానికి తెలియకపోవడం ఆశ్చర్యం. దేవస్థానం భద్రత నిమిత్తం చీఫ్ సెక్యూరిటీ అధికారిగా పనిచేస్తున్న రిటైర్డ్ డీఎస్పీ శ్రీనివాసరావు నెలకు రూ.50 వేలు, సెక్యూరిటీ అధికారులుగా పనిచేస్తున్న ఇద్దరు రిటైర్డ్ ఎస్సైలు ఒక్కొక్కరు నెలకు రూ.30 వేలు జీతం తీసుకుంటున్నారు. సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డులు మొత్తం 130 మంది వరకు విధులు నిర్వర్తిస్తున్నారు. డ్రోన్ కలకలంతో వీరి పనితీరు ప్రశ్నార్థకంగా మారింది.

ఎన్నికల కోడ్ ఉన్నా మద్యం విక్రయం



పాలకొల్లు మున్సిపల్ కార్యాలయం వద్ద మద్యం విక్రయిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: ఎలక్షన్ కోడ్‌లోనూ యథేచ్ఛగా మద్యం విక్రయాలు కొనసాగాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ కారణంగా ఎక్సైజ్ అధికారులు రెండు రోజులు ముందుగానే మద్యం షాపులు సీజ్ చేశారు. అయితే సీజ్ చేసిన షాపుల వద్ద పెద్ద ఎత్తున మద్యం విక్రయిస్తున్నారు. పాలకొల్లు పట్టణ మెయిన్‌రోడ్డులో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఓ బార్‌లో జనం కిటకిటలాడారు. ఆ బార్‌లో సిబ్బంది సంచిలో మద్యం బాటిళ్లు తీసుకొచ్చి బయట అరుగు మీద విక్రయింస్తున్నారు. పట్టణంలో ఉన్న సుమారు అన్ని బార్‌ల వద్ద ఇదే పరిస్థితి.

టీడీపీ నేతపై మరో ఫిర్యాదు

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన టీడీపీ నేత కొత్తపల్లి సుబ్బారావుపై అదే గ్రామానికి చెందిన నంబూరి నాగతులసి బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి తెలిపిన కథనం ప్రకారం.. ఏడాది క్రితం నాగతులసి కుమారుడికి పెదవేగిలోని గురుకుల పాఠశాలలో 7వ తరగతి అడ్మిషన్ ఇప్పిస్తానని నమ్మించి సుబ్బారావు రూ.20 వేలు తీసుకున్నాడు. తనకు మంత్రులు, ఎమ్మెల్యేలు తెలుసని, తప్పకుండా సీటు వస్తుందని నమ్మబలికాడు. రోజులు గడుస్తున్నా ప్రయోజనం లేకపోవడంతో బాధితురాలు సుబ్బారావును నిలదీసింది. సరైన సమాధానం రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. మరో ఇద్దరు బాధితులు ఫిర్యాదు చేసేందుకు పోలీస్టేషన్ వద్దకు వెళ్లగా, సుబ్బారావు వారితో రాజీ పడినట్టు తెలిసింది.

నేడే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నిక

- ఏలూరు జిల్లాలో 20, పశ్చిమగోదావరి 20 పోలింగ్ స్టేషన్లు
- ఏలూరులో 2667, పశ్చిమలో 3729 ఓట్లు
- ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- ఎన్నికల బరిలో ఐదుగురు అభ్యర్థులు



ఏలూరు తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎన్నికల సామగ్రి తీసుకువెళ్తున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధమైంది. గురువారం పోలింగ్ పకడ్బందీగా నిర్వహించడానికి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్లు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సాబ్జీ మరణంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికల బరిలో ఐదుగురు బరిలో ఉండగా కీలకపోరు గంధం నారాయణరావు, బొర్రా గోపీమూర్తి మధ్య కొనసాగే అవకాశం ఉంది. రెండు జిల్లాల్లో కలిపి 40 పోలింగ్ బూత్‌ల్లో 6,396 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బ్యాలెట్ విధానంలో ఓటింగ్ నిర్వహిస్తారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ప్రాతిపదికన నిర్వహించే ఈ ఎన్నికల్లో బూత్‌ల పరిధిలోని ఓటర్ల జాబితాను ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. బుధవారం ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లల్లో ఏర్పాట్లు పరిశీలించి ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఎలక్షన్ మెటీరియల్ అప్పగించడంతో పాటు పరిస్థితిని పరిశీలించారు. ఏలూరు జిల్లాలో 144 మంది సిబ్బందికి ఎన్నికల విధులు కేటాయించారు. 24 మంది పోలింగ్ ఆఫీసర్ల నేతృత్వంలో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేయడంతో పాటు 24 మంది మైక్రో అబ్జర్వర్లు, 24 మంది వెబ్‌కాస్టింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు చేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో కలెక్టర్ చదలవాడ నాగరాణి ఏర్పాట్లు పరిశీలించారు. 26 మంది పోలింగ్ ఆఫీసర్ల నేతృత్వంలో 125 సిబ్బందితో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశారు.



కోటదిబ్బ డిగ్రీ కళాశాలలో బ్యాలెట్ బాక్సు, సామగ్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి



భీమవరం ఆర్డీఓ కార్యాలయంలో పోలింగ్ ఏర్పాట్లలో అధికారులు

ఏలూరు, భీమవరంలో అత్యధిక ఓట్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6,396 ఓట్లు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా ఏలూరు అర్బన్‌లో 896 జిల్లా కేంద్రమైన భీమవరంలో 759 ఓట్లు ఉన్నాయి. ప్రతి మండలంలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాల్లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ నిర్వహించి కలెక్టరేట్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులను తరలించడానికి వీలుగా అన్ని ఏర్పాట్లు చేశారు. రెండు జిల్లాల ఎస్పీలు బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేశారు.

బరిలో ఐదుగురు అభ్యర్థులు

బొర్రా గోపిమూర్తి (భీమవరం), గంధం నారాయణరావు (ద్రాక్షారామం), నామాన వెంకటలక్ష్మి (సామర్లకోట), పి.దీపక్ (తాడేపల్లిగూడెం), కలవం నాగేశ్వరరావు (రాజమండ్రి) బరిలో నిలిచారు. నామినేషన్ దాఖలుకు ముందు నుంచే ఉభయగోదావరి జిల్లాలో అభ్యర్థులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. గోపిమూర్తి, నారాయణరావుకు వివిధ ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ప్రకటించడంతో మండలాలవారీగా తిరిగి విస్తృత ప్రచారం నిర్వహించారు.

వాహనాలు లేక ఇబ్బందులు

భీమవరం ఆర్డీఓ కార్యాలయం నుంచి 7 పోలింగ్ స్టేషన్లకు పోలింగ్ సామగ్రి, సిబ్బంది వెళ్లాల్సి ఉండగా వాహనాలు సమకూర్చకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఏలూరు జిల్లాలో మండలాల వారీగా ఓట్లు

ఏలూరు అర్బన్	896	జంగారెడ్డిగూడెం	273
ఏలూరు రూరల్	16	టి.నరసాపురం	35
దెందులూరు	77	కామవరపుకోట	55
నిడమర్రు	27	ద్వారకాతిరుమల	69
కుక్కునూరు	6	చింతలపూడి	232
వేలేరుపాడు	11	లింగపాలెం	48
జీలుగుమిల్లి	70	ఉంగుటూరు	69
బుట్టాయగూడెం	339	భీమడోలు	91
పోలవరం	103	పెదవేగి	65
కొయ్యలగూడెం	113	పెదపాడు	72

పశ్చిమగోదావరి జిల్లాలో మండలాల వారీగా ఓట్లు

భీమవరం	759	పోడూరు	71
అత్తిలి	90	పాలకోడేరు	102
ఆకివీడు	90	పెనుమంత్ర	85
ఆచంట	63	పెనుగొండ	156
గణపవరం	66	పాలకొల్లు	480
ఇరగవరం	53	తాడేపల్లిగూడెం	375
కాళ్ళ	52	తణుకు	407
మొగల్తూరు	88	ఉండి	69
నరసాపురం	425	వీరవాసరం	129
పెంటపాడు	73	యలమంచిలి	94

క్లుప్తంగా

మేజిక్ బోస్‌కు ఐబీఆర్ అచీవర్ అవార్డు


అవార్డు అందుకున్న బోస్

భీమవరం: భీమవరం పట్టణానికి చెందిన ప్రఖ్యాత ఇంద్రజాలికుడు, రచయిత మేజిక్ స్టార్ బోస్‌కు ఐబీఆర్ అచీవర్ టైటిల్‌తో అరుదైన అవార్డును ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రదానం చేసింది. గత 53 ఏళ్లుగా మేజిక్ రంగంలోని విభిన్న శాఖల్లో బోస్ చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. దేశంలోనే అత్యధిక మేజిక్ పుస్తకాల రచయితగాను బోస్ పేరు పొందారు. 30 ఏళ్లక్రితం తాను రచించిన 'మేజిక్ గైడ్' పుస్తకాన్ని విశిష్ట గ్రంథంగా పేర్కొంటూ ఐబీఆర్ అచీవర్ అవార్డును ప్రకటించినట్లు బోస్ బుధవారం భీమవరంలో విలేకర్లకు చెప్పారు.

నూజివీడులో మరో చోరీ

నూజివీడు: నూజివీడు పట్టణంలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఎంప్లాయీస్ కాలనీ, నెహ్రూపేటల్లో వరుసగా దొంగతనాలు చోటు చేసుకోగా మంగళవారం రాత్రి పీజీ సెంటర్ ఎదురుగా ఉండే సుగ్గిశెట్టి శ్రీనివాసరావు ఇంట్లో చోరీ జరిగింది. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు ఈనెల 2న సాయంత్రం ఇంటికి తాళం వేసి తిరుమల వెళ్లి బుధవారం ఉదయం తిరిగి వచ్చారు. తలుపు తాళం విరగకొట్టి ఉండడంతో, లోపలికెళ్లి చూడగా బీరువా తాళం పగులకొట్టి ఉండడం, వస్తువులు, దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. 8 గ్రాముల బంగారు చెవిదిద్దులు, రూ.25 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కైకలూరులో చోరీ

కైకలూరు: కైకలూరులో చోరీ జరిగింది. స్థానిక టౌన్ హాల్ ఎదుట వీధిలో నివాసం ఉంటున్న గొర్లి సీతారామయ్య, భారతీ దంపతులు ఇంటికి తాళం వేసి మంగళవారం సాయంత్రం విజయవాడ వెళ్లారు. బుధవారం ఉదయం వచ్చేసరికి ఇంటి తలుపులు పగలగొట్టి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి పరిశీలించగా 32 గ్రాముల బంగారం, 12 తులాల వెండి అపహరణకు గురైనట్లు గుర్తించారు. టౌన్ ఎస్సై వెంకట్‌కుమార్ ఆధ్వర్యంలో ఏలూరు నుంచి క్లూస్ టీం, డాగ్ స్కాడ్‌లు పరిశీలించాయి. సీతారామయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినియోగం తక్కువ.. బాదుడే ఎక్కువ

- భారీగా పెరిగిన విద్యుత్ బిల్లులు
- సామాన్యులకు విద్యుత్ బిల్లుల షాక్
- కూటమి ప్రభుత్వంపై వెల్లువెత్తుతున్న ఆగ్రహం


నూజివీడులో విద్యుత్ రీడింగ్ తీస్తున్న మీటర్ రీడర్


విద్యుత్ బిల్లు

నూజివీడు: కూటమి ప్రభుత్వం సామాన్యులకు చుక్కలు చూపెడుతోంది. ఈ ప్రభుత్వంలో ఇప్పటికే నిత్యావసర ధరలు మండుతుండడంతో అల్లాడిపోతున్న ప్రజలు ప్రస్తుతం విద్యుత్ బిల్లులు కూడా అధికంగా వస్తుండడంతో బెంబేలెత్తిపోతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ బిల్లులు పెంచమని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీలను దారుణంగా పెంచేశారు. భారీగా పెరిగిన విద్యుత్ బిల్లులను చూసి సామాన్యులు షాక్‌కు గురవుతున్నారు. ఇంతేసి బిల్లులు ఎలా కట్టగలమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిని చెల్లించాలంటే సామాన్యులకు భారంగా పరిణమిస్తుంది.

వాడకం కంటే అదనపు బాదుడే ఎక్కువ

పట్టణంలో సర్వీసు నెంబరు 5637కు సంబంధించి నవంబరు నెలలో 116 యూనిట్లు విద్యుత్‌ను వాడగా దానికి రూ.376.50 కరెంటు చార్జీలతో మొత్తం బిల్లు రూ.873 బిల్లు వచ్చింది. దీనిలో రూ.376.50 విద్యుత్ వాడకానికి సంబంధించి మిన హాయిస్తే, ఫిక్స్‌డ్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, సర్‌ఛార్జి, ట్రూ అప్, ఎఫ్‌పీపీసీఏ చార్జీలు రెండు సార్లు మొత్తం కలిపి రూ.496.50 అదనంగా వేశారు. అంటే వాడుకున్న విద్యుత్‌కు అయ్యే బిల్లు కంటే ప్రభుత్వం విధిస్తున్న అదనపు బాదుడు రెండు రెట్లు ఎక్కువగా ఉంటోంది. దీంతో విద్యుత్ బిల్లులు తడిచిమోపెడవుతున్నాయి.

ప్రభుత్వంపై ఆగ్రహం

గత రెండురోజులుగా వచ్చిన విద్యుత్ బిల్లులను చూసి సామాన్యులు, మధ్య తరగతి ప్రజలు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూపాయి కూడా విద్యుత్ బిల్లులు పెంచమని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు ఇంత దారుణంగా విద్యుత్ బిల్లులను పెంచడంపై ఇది నమ్మకద్రోహమని ధ్వజమెత్తుతున్నారు.

రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారుల నుంచి రూ.6072 కోట్లు వసూలు చేసుకునేందుకు డిస్కంలకు ప్రభుత్వం అక్టోబర్‌లో అనుమతినిచ్చింది. దీంతోనే డిసెంబరు నుంచి విద్యుత్ బిల్లులు పెరుగుతున్నాయని విద్యుత్‌శాఖలోని అధికారులు చెబుతున్నారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ వసూళ్లకు ఏపీ ఈఆర్‌సి అనుమతించింది. దీంతో ఏడాదిన్నరపాటు అదనపు చార్జీల పేరిట వసూలును నవంబరు నుంచి ప్రారంభించడంతో డిసెంబరు బిల్లులు భారీగా వస్తున్నాయి. బిల్లులో కూడా ఏప్రిల్ 22, ఎఫ్‌పీపీసీఏ చార్జీలు అని పేర్కొంటున్నారు.

అద్దె ఇళ్లల్లో ఉండేవారిపై పడుతున్న భారం

విద్యుత్ సంస్థలు నవంబరు నుంచి వసూలు చేస్తున్న ఫ్యూయల్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్(ఎఫ్‌పీపీసీఏ) చార్జీలను ఏప్రిల్ 22 నెలకు సంబంధించి డిసెంబరు బిల్లులో వేశాయి. అప్పట్లో అద్దె ఇంట్లో ఉన్న వాళ్లు ఎక్కువ యూనిట్లు విద్యుత్‌ను వాడి వేరే ప్రాంతానికి వెళ్లిపోయి అదే ఇంట్లోకి వేరే వారు అద్దెకు వచ్చి ఉండవచ్చు. అప్పట్లో వాడిన విద్యుత్‌కు సంబంధించిన ఎఫ్‌పీపీసీఏ చార్జీలను ఇప్పుడు విధిస్తుండటంతో ప్రస్తుతం అద్దెకు ఉంటున్న వారి నెత్తిన పడుతున్నాయి. దీంతో వారు మాకేమి సంబంధమంటూ గగ్గోలు పెడుతున్నారు. పట్టణాల్లో ఎక్కువ మంది అద్దె ఇళ్లల్లోనే నివాసముంటుండటంతో ఎవరికి వాళ్లు మాకేమీ సంబంధం లేదని, అయినా మేము చెల్లించాల్సి వస్తోందంటూ వాపోతున్నారు.

అదనపు భారమే ఎక్కువ



కరెంటు బిల్లుల్లో అసలు చార్జీ కంటే అదనపు భారం ఎక్కువగా ఉంది. ఎప్పుడో వాడిన విద్యుత్‌కు ఇప్పుడు చార్జీ విధించడం దారుణం. పేద, మధ్యతరగతి ప్రజలు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఇబ్బంది పడుతుంటే విద్యుత్ బిల్లులు మరింత భారంగా మారాయి. – నాగరాణి, నూజివీడు

విద్యుత్ బిల్లుల భారం తగ్గించాలి



రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లులు విపరీతంగా పెంచి ప్రజల నెత్తిన భారం మోపింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ బిల్లులు పెంచమని హామీ ఇచ్చారు. ఇప్పుడు భారం మోపడం సరైన చర్య కాదు. ఇలా వ్యవహరించడం దారుణం. వెంటనే పెరిగిన చార్జీలను ఉపసంహరించాలి.

– జీ రాజు, సీపీఎం నాయకుడు, నూజివీడు

చార్జీల పెంపును నిరసిస్తూ ధర్నా


బుట్టాయగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో యూనిట్‌కు 92 పైసలు పెంచడాన్ని నిరసిస్తూ బుట్టాయగూడెంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా కమిటీ సభ్యులు ధర్మల సురేష్ మాట్లాడుతూ 2000వ సంవత్సరంలో జరిగిన విద్యుత్ ఉద్యమాన్ని గుణపాఠంగా తీసుకోకుండా మరోసారి భారీస్థాయిలో విద్యుత్ చార్జీలు పెంచి కూటమి ప్రభుత్వం ప్రజలపై పెనుభారం మోపిందని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి భారీగా చార్జీలను పెంచడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని కూడా విరమించుకోవాలని డిమాండ్ చేశారు. తొలుత స్థానిక రామనరసయ్య భవనం నుంచి నెహ్రూ భవనం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. నాయకులు కారం రాఘవ, తగరం బాబూరావు, కేవీ రమణ, సరియం రామ్మోహన్‌రావు, ఈ భూషణం, కె.రామలక్ష్మి, బన్నే వినోద్, కెచ్చెల పోతిరెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి పశ్చిమలో భూప్రకంపనలు

తణుకు టౌన్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పలుచోట్ల బుధవారం భూప్రకంపనలు సంభవించాయి. ఉదయం 7.30 నుంచి 7.45 మధ్య భూమి కంపించినట్లు పలువురు పేర్కొంటున్నారు. దీంతో కొన్నిచోట్ల జనం ఇళ్లల్లో నుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. కొన్ని సెకన్ల పాటు భూమి కంపించిన తర్వాత పరిస్థితి యథాస్థితికి వచ్చినట్లు చెబుతున్నారు. ఎక్కడా ఎటువంటి నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తణుకు పట్టణంలోని పలు అపార్ట్‌మెంట్ వాసులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా భూ ప్రకంపనలను గుర్తించినట్లు చెబుతున్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో స్వల్ప భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. కొన్ని సెకన్ల పాటు భూమి కంపిస్తూ పెద్ద శబ్దాలు రావడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

జంగారెడ్డిగూడెం: పట్టణంలో స్థానిక రాజుల కాలనీ, గౌరీశంకరపురం, అయ్యన్నకాలనీ, జెడ్పీ హైస్కూల్ ఏరియా, కొత్తబస్టాండ్ ఏరియా, సాలిపేట ఇలా పలు ప్రాంతాల్లో ఉదయం కొన్ని సెకన్లపాటు భూమి కంపించింది. అలాగే మండలంలోని గుర్వాయిగూడెం, వేగవరం తదితర గ్రామాల్లో కూడా భూమి కంపించింది.

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలో రెండు సెకన్లపాటు భూమి కంపించింది. కన్నాపురం రోడ్డులో పలు ఇళ్లల్లో సామాగ్రి, కుర్చీలు కదిలినట్లు ప్రజలు చెబుతున్నారు. కుంతలగూడెం (ఆరిపాటి) గ్రామంలో కూడా భూప్రకంపనలు సంభవించాయని అంటున్నారు.

వేలేరుపాడు: గోదావరి పరివాహక ప్రాంతమైన వేలేరుపాడు మండలంలో ఉదయం 7.26 గంటల సమయంలో 3 సెకన్ల పాటు భూమి కంపించింది. శబ్దాలు రావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. 12 ఏళ్ల క్రితం కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో భూ కంపం రాగా, తాజాగా గోదావరీ పరివాహక ప్రాంతాల్లో భూ ప్రకంపనలు చోటు చేసుకున్నట్లు చెబుతున్నారు.

కుక్కునూరు: కుక్కునూరు మండలంలో ఉదయం 7:30 గంటల ప్రాంతంలో స్వల్పంగా భూమి కంపించింది. కొన్ని సెకన్ల పాటు వచ్చిన భూప్రకంపనలతో జనం బెంబేలెత్తిపోయారు. ఇళ్ల పైకప్పు రేకులు కదిలాయని, కిటికీలు ఊగడం చూశామని పలువురు చెబుతున్నారు.

ద్వారకాతిరుమలలో..

ద్వారకాతిరుమల: మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలో బుధవారం ఉదయం భూమి కంపించింది. కొన్ని సెకన్లపాటు ప్రకంపనలు రావడంతో ప్రజలకు ఏమీ అర్థం కాలేదు. ఇంట్లోని మంచాలు, సామాగ్రి కదలాయని చెబుతున్నారు.

కంగారు పడ్డాం



స్థానిక సాలిపేటలో అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నాను. బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో ఇంటి ద్వారం, కిటికీ తలుపులు కొన్ని సెకన్ల పాటు కొట్టుకున్నాయి. ఇంట్లోని కుర్చీలు ఆటూ, ఇటు కదిలాయి. దీంతో కంగారు పడ్డాం. కొద్దిసేపటి తరువాత భూ ప్రకంపనలు అని తెలిసింది. దీంతో ఆందోళనకు గురయ్యాం.

– డి.ఛందేశ్వరరావు, జంగారెడ్డిగూడెం

బయటకు పరుగులు తీశాం



ఉదయం సుమారు 7.30 గంటల సమయంలో ఇంట్లో ఉండగా భూమి కంపించింది. ఇంట్లోని కుర్చీ, గ్యాస్ బండ ప్రకంపనలకు అటూ ఇటూ కదిలాయి. దీంతో భయపడ్డాం. వెంటనే బయటకు పరుగులు తీశాం. ఇంట్లో వస్తువులన్నీ కొన్ని సెకన్ల పాటు కదిలాయి. చుట్టుపక్కల వారు కూడా రోడ్డు మీదకు వచ్చేశారు. – కొప్పాక శ్రీనివాసరావు, జంగారెడ్డిగూడెం

భూమి కంపించడం గమనించా ..



భూమి కంపించడంతో భయం వేసింది. ఉదయం సుమారు 7.30 గంటల ప్రాంతంలో ఇంట్లో కుర్చీలో కూర్చొని ఉండగా శబ్దంతోపాటు భూమి కంపించడం గమనించా. కాళ్ల కిందనుంచి భూమి అదురుతూ తరంగంలా వెళ్లినట్టు అనిపించింది.

షేక్ ఖాదర్, వ్యాపారి, కుక్కునూరు

చీటింగ్ కేసులో వ్యక్తి అరెస్టు


ముద్దాయిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

పోలవరం రూరల్: చీటింగ్ కేసులో ఒక వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని చెప్పి సుమారు రూ.36 లక్షలు తీసుకుని ఉడాయించిన కేసులో ప్రథమ ముద్దాయి అయిన బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన బక్కా అబ్రహం అనే వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. అతని వద్ద నుంచి ఒక కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. అబ్రహంను జంగారెడ్డిగూడెం కోర్టుకు హాజరుపరచగా ఈ నెల 18 వరకు కోర్టు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ తరహా నేరాల్లో పలుమార్లు ముద్దాయి జైలుకు వెళ్లినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఈ కేసులో మిగిలిన నేరస్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. రేపల్లెవాడకు చెందిన కోటిపల్లి రమేష్ దంపతులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వరుడైన సుబ్బారాయుడు


పెండ్లి ముస్తాబులో వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో సుబ్బారాయుడి దివ్య కల్యాణ మహోత్సవాలు బుధవారం నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ సుబ్రహ్మణ్యేశ్వరుని పెండ్లి కుమారునిగాను, వల్లీ, దేవసేన అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగాను ముస్తాబు చేశారు. అట్టహాసంగా జరిగిన ఈ వేడుకలో ఆలయ డీఈఓ బాబురావు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఆలయంలో ధ్వజారోహణ, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరుగుతాయని అర్చకులు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం


లాంచీల రేవు సమీపంలో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

ఆకివీడు: స్థానిక లాంచీల రేవు సమీపంలో రెండు బస్తాల్లో లభించిన రేషన్ బియ్యంను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయ్ డీటీ మహేష్‌కు అప్పగించారు. తహసీల్దార్ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ఘటనా స్థలంలో తనిఖీలు నిర్వహించగా సుమారు 200 కేజీల రేషన్ బియ్యం దొరికాయని, అయితే ఆ ప్రదేశంలో బియ్యానికి సంబధించిన వ్యక్తులు ఎవరూ లేరని డీటీ చెప్పారు. సీజ్ చేసిన బియ్యాన్ని స్థానిక సమతానగర్‌లోని నెం.44 రేషన్ షాపులో భద్రపరిచినట్లు తెలిపారు.

ఆక్వా మందుల షాపుల తనిఖీ


గణపవరంలో ఆక్వా మెడికల్ షాపును తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్

గణపవరం: గణపవరంలోని ఆక్వా మందుల దుకాణాలను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబిద్‌అలీ బుధవారం తనిఖీ చేశారు. సుధా ఆక్వా, రాజేష్ ఆక్వా షాపులలో నిషేధిత మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించి, కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా మందుల దుకాణాల్లో నిషేధిత, నకిలీ ఆక్వా మందులు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. నిషేధిత, నకిలీ మందులు విక్రయిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘంటసాల చరితం అజరామరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సంగీత ప్రపంచంలో ఘంటసాల చరితం అజరామరమని పలువురు అతిథులు అన్నారు. ప్రముఖ సంగీత దర్శకులు, గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక వైఎంహెచ్ఏ హాల్‌లో ఘంటసాల సంగీత గానామృత లహరి కార్యక్రమం అత్యంత వేడుకగా నిర్వహించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన బుద్దాల వెంకట రామారావు, లంక వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ శాస్త్రి, ఈపూరి సత్యనారాయణ తదితరులు ఘంటసాల స్వరపరిచిన పాటలను, సంగీత దర్శకత్వం వహించిన చిత్రాలను ప్రస్తావించారు. ప్రపంచ సంగీత రంగంలో ఘంటసాలకు సువర్ణాక్షరాలతో లిఖించిన పేజీ ఒకటుందన్నారు. తొలుత ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు అలంకరించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంగీత కళాశాల విద్యార్థినీ విద్యార్థులు ఘంటసాల స్వరపరిచిన పాటలు ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ఘంటసాల సంగీత కళాశాల ప్రధానాచార్యులు వీ రేవతి రామ్‌కుమార్ అధ్యక్షత వహించగా, కార్యక్రమ సమన్వయకర్తగా ఎండీ ఖాజావలి వ్యవహరించారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

మండవల్లి: అప్పుల బాధతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన లోకుమూడిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మత్తే పేతురుకు తెలియకుండా అతని భార్య సుజాత ఫిన్‌కేర్, స్పందన, కేపిటల్ గ్రూపుల నుంచి డబ్బులు అప్పు తీసుకుంది. అనంతరం ప్రతిరోజు వారు డబ్బులు ఎప్పుడు ఇస్తావు.. పెద్దల్లో పెట్టి వసూలు చేసుకుంటాం అని ఒత్తిడి చేసేవారు. దీంతో భర్తకు తెలిస్తే ఏమవుతుందోనని, పెద్దల్లో పెడితే పరువు పోతుందని భయపడి బుధవారం ఇంట్లో ఉన్న కిరోసిన్ డబ్బా తీసుకుని వంటిపై పోసుకుని నిప్పు అంటించుకుంది. చుట్టుపక్కల వాళ్లు మంటలను ఆర్పి ఆమెను కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

అన్నదాతపై బీమా భారం

- ఉచిత పంటల బీమాకు మంగళం పాడిన కూటమి ప్రభుత్వం
- బీమా ప్రీమియం రైతులే చెల్లించాలంటూ ఉత్తర్వులు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పంటలకు ఉచిత బీమా


పొలం దున్నుతున్న రైతు

ఇరగవరం: అన్నదాతలు ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట ప్రకృతి విపత్తుల వల్ల దెబ్బతింటే ప్రభుత్వం వారికి అండగా ఉంటూ ఆదుకోవాలి. కానీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పనిచేస్తోంది. రైతులకు అండగా ఉండడం మాట అటుంచితే, రైతు వ్యతిరేక విధనాలను అనుసరిస్తూ రైతులపై పగ సాధింపు చర్యల్లా ఉన్నాయని పలువురు రైతులు అంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ఉచిత పంట బీమా పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. వర్షాలు, తుఫాన్‌లతో పంటకు నష్టం వాటిల్లినప్పుడు రైతులను ఆదుకునేందుకు దోహదపడుతుందనే ఉద్దేశ్యంతోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2019 ఖరీఫ్ సీజన్ నుంచే ఉచిత పంట బీమా పథకాన్ని ఈ–క్రాప్‌లో నమోదు చేసి సాగు విస్తీర్ణం అంతటికీ బీమా వర్తించేలా ప్రభుత్వమే రైతుల తరపున ప్రీమియం చెల్లించేది. రైతులపై ఒక్క రూపాయి కూడా భారం పడేది కాదు. బీమా ప్రీమియం చెల్లించేందుకు రైతులు ఆర్థిక ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండేది కాదు. పంటలకు నష్టం వాటిల్లితే ఠంచన్‌గా పరిహారం అందేది. నియోజకవర్గంలో 2021 ఖరీఫ్ సీజన్‌లో తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతినగా వైఎస్సార్ ఉచిత పంట బీమా పథకం కింద వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిహారం అందించింది.

రైతన్నల ఆవేదన

చంద్రబాబు ప్రభుత్వం ఉచిత పంటల బీమాను రద్దు చేయడంతో ప్రీమియం భారం రైతులపై పడుతోంది. రబీ సీజన్‌కు సంబంధించి పంట బీమా కోసం రైతులే ప్రీమియం సొమ్ము చెల్లించాలంటూ ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. పంటల బీమా ప్రీమియం చెల్లింపులు రైతులే చేయాలని ప్రభుత్వం నిర్ణయం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ప్రభుత్వమే రైతుల తరపున సంబంధిత బీమా సంస్థలకు ప్రీమియం చెల్లించాలని కోరుతున్నారు. రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం కూడా ప్రభుత్వం ఇంకా అందించలేదని, అప్పులు చేసి పంట సాగు చేస్తున్నామని ఇప్పుడు బీమా పథకాన్ని కూడా నీరుగార్చితే ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

అన్యాయం



గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమాను రద్దు చేయడం అన్యాయం. కూటమి ప్రభుత్వం చర్యలు రైతులను దెబ్బతీసేలా ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పథకం పేరుతో పెట్టుబడి సహాయం చెప్పిన సమయానికి అందించేవారు. ఉచిత పంటల బీమ ఆ పథకం పేరిట పంటలకు ప్రభుత్వమే బీమా చేయించేది. కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని పూర్తిగా నిలిపివేయగా, రైతు భరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవగా మార్చారే తప్ప ఎవరికీ పెట్టుబడి సహాయం అందించలేదు. రైతులపై ప్రీమియం భారం పడకుండా రబీ పంటలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి. బీమా చేయించుకోకపోతే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిన్నప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ రాదు.

కడుపూడి నాగసత్యనారాయణ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ సభ్యుడు.

సమంజసం కాదు



పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి. గతంలో అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాలి. ప్రభుత్వం రైతులపై భారం మోపడం సమంజసం కాదు. పెట్టుబడికే డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంటే బీమా చెల్లించాలని అనడం అన్యాయం. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందజేయాలి.

దొంగ శ్రీను, ఇరగవరం

క్లుప్తంగా

రోశయ్య సేవలు అభినందనీయం


రోశయ్య విగ్రహం వద్ద ఆర్యవైశ్యుల నివాళులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు రాష్ట్ర గవర్నర్ కొనిజేటి రోశయ్య వర్ధంతిని ఆర్యవైశ్యులు బుధవారం స్థానిక వాసవి కన్యకపరమేశ్వరీ కల్యాణ మండపంలో రోశయ్య విగ్రహం వద్ద నిర్వహించారు. రోశయ్యకు పూలమాలలు వేసి నివాళ్లలర్పించారు. కొల్లేపర రాము, నున్న సుందరరావు, భోగవిల్లి రమేష్, కొండూరి రాము, కొత్త శివ, ఇతర ఆర్యవైశ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



గూడెం ఎక్సైజ్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన స్వరాజ్యలక్ష్మి

తాడేపల్లిగూడెం: ఎక్సైజ్ గూడెం సీఐగా స్వరాజ్యలక్ష్మి బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. భీమవరం నుంచి బదిలీపై ఆమె ఇక్కడకు వచ్చారు. రెండు నెలలు ముందుగానే ఇక్కడ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించాల్సి ఉండగా, వ్యక్తిగత కారణాల రీత్యా బాధ్యతలు చేపట్టలేదు. ఇన్‌చార్జ్‌గా టాస్క్‌ఫోర్సు సీఐ కల్యాణ చక్రవర్తి వ్యవహరించారు. స్వరాజ్యలక్ష్మి గతంలో గూడెం ఎక్సైజ్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేశారు. ఉద్యోగ బాధ్యతలు తీసుకున్న అనంతరం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే బొలిశెట్టిని, విజయవాడలోని శాఖ ఉన్నతాధికారులను కలిశారు.

7 నుంచి సుబ్బారాయుడి షష్ఠి ఉత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నందమూరు గ్రామంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు ఈ నెల 7, 8వ తేదిల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 7న షష్ఠి, 8న ఉదయం 11 గంటల నుంచి భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు వివరించారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

మేడబడిలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు



మేడబడిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

అత్తిలి: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అత్తిలి మేడబడిలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ దశిక వంశీ బుధవారం తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు గురువారం జరిగే ఎన్నికల పోలింగ్ కేంద్రంలో అత్తిలి మండల పరిధిలో 90 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 5 గురు అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు.

అడుగంటుతున్న చెరువులు

పట్టించుకోని అధికారులు


రావిపాడులో అడుగంటిన చెరువు

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో తాగునీటి చెరువులు అడుగంటుతున్నాయి. ఆ నీటినే కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. వేసవికి ముందే తాగునీటి కొరత ప్రారంభమైంది. సార్వా మాసూళ్లకు ముందు కాలువ నీటిని అధికారులు రైతుల ప్రయోజనాల దృష్ట్యా తగ్గించారు. అయితే పలు గ్రామాల్లో ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో చెరువులు పూర్తి స్థాయిలో నింపుకోలేక పోయారు. ఇటీవల పలువురు గ్రామ కార్యదర్శులు బదిలీలపై వెళ్లడం, కొత్తకార్యదర్శులు రావడం జరిగింది. అయితే గ్రామాలలో పూర్తిస్థాయి అనుభవం లేని కార్యదర్శులు తాగునీరు, శానిటేషన్, డ్రెయినేజీల శుభ్రతపై పట్టించుకోలేదని పలువురు చెబుతున్నారు. గ్రామాలలో మౌలిక వసతుల కల్పన ప్రధానంగా సర్పంచ్ కన్నా కార్యదర్శికే బాధ్యత ఉంటుంది. అయితే గతంలో మండల అధికారులు, కార్యదర్శులు నూతనంగా వచ్చిన సందర్భంలోనూ, ప్రతి నెలా సమావేశాలు నిర్వహించేవారు. కానీ మండల అధికారుల లోపం కారణంగా ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా యానాలపల్లి, కె. పెంటపాడు, రావిపాడు, వల్లూరుపల్లి గ్రామాలలో ఈ సమస్య ఉంది. తక్షణమే అధికారులు సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హ్యాండ్ రైటింగ్‌లో విద్యార్థి ప్రతిభ

తణుకు అర్బన్: హైదరాబాద్‌కు చెందిన మహా అకాడమీ నిర్వహించిన రైటివిటీ 2024 హ్యాండ్ రైటింగ్ పోటీలో తణుకు రూట్స్ విద్యార్థి నేషనల్ విన్నర్‌గా నిలిచినట్లు సంస్థ డైరెక్టర్ బి.విద్యాకాంత్ తెలిపారు. గత నెల 8వ తేదీన నిర్వహించిన ఈ పోటీలో రూట్స్ విద్యార్థి కె.హరిప్రసాద్ నేషనల్ విన్నర్‌గా నిలవగా, మరొక 24 మంది విద్యార్థులు స్టేట్ విన్నర్స్‌గా నిలిచినట్లు ఆయన వివరించారు. విద్యార్థిని సంస్థ డైరెక్టర్‌లు ఎస్.సుధాకర్‌వర్మ, ఎల్‌కే త్రిపాఠి, బి.విద్యాకాంత్, ఉపాధ్యాయులు ప్రశంసించారు.

ఘనంగా ఘంటసాల జయంతి


ఘంటసాల విగ్రహం వద్ద గాన సభ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గాన గంధర్వ, పద్మశ్రీ ఘంటసాల జయంతిని బుధవారం స్థానిక వీకర్స్‌కాలనీలో ఘంటసాల గాన సభ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జయంతి సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఖాసిం, ఉపాధ్యక్షుడు అల్లం శంకర రావు, జాయింట్ సెక్రటరీ నాగూర్‌లు మాట్లాడుతూ ఘంటసాల పాటలు అజరామరం అన్నారు. టి.శోభనాద్రిరావు, పి.ఉమాశేషగిరి గుప్త, బాయిశెట్టి వెంకన్న, చోడవరపు అంజి, అయితం సూర్యనారాయణ, ఈవీ సత్యనారాయణలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠికి ఏర్పాట్లు పూర్తి


పాతూరులోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం


విశేష అలంకరణలో స్వామివారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): షష్ఠి ఉత్సవాలకు నియోజకవర్గంలోని పలు చోట్ల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. పాతూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. స్వామి వారి కల్యాణ మహోత్సవం ఈ నెల 6న శుక్రవారం రాత్రి 7 గంటల 50 నిమిషాలకు ధనిష్టా నక్షత్రయుక్త మిథున లగ్నమందు స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. మానేపల్లి శ్రీనివాసరావు, వేద రాజేశ్వరిదేవి దంపతులచే ప్రధాన అర్చకులు జోశ్యుల శ్రీరామచంద్రమూర్తి శర్మ బ్రహ్మత్వం వహించనున్నారు. అనంతరం అర్థరాత్రి 2 గంటల నుంచి స్వామి వారి దర్శనానికి అనుమతి ఇస్తారు. 7వ తేదీన శనివారం తెల్లవారుజామున షష్ఠి మహోత్సవాలు సందర్భంగా స్వామి వారికి పూలు, పడగలు, ఇతర పూజా సామగ్రి ఇచ్చి పూజలు నిర్వహించనున్నారు. ఆలయంలో స్వామి వారి దర్శనం, తీర్థ ప్రసాదాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం పల్లకి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. షష్ఠి సందర్భంగా ఆలయాన్ని సుందర నందనంగా రంగులతో తీర్చిదిద్దుతున్నారు. ఆలయ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. పోలీస్, ఎన్‌సీసీ, స్వచ్ఛంధ సేవా సంస్థల సభ్యులతో భక్తులు స్వామి వారి దర్శించేందుకు వీలుగా పలు ఏర్పాట్లు చేస్తున్నారు. షష్ఠి హంగుల కావాల్సిన అన్ని ఏర్పాట్లు జయింట్ వీల్, రంగుల రాట్నాలు, కొలంబస్, అదే విధంగా వివిధ దుకాణాలను సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని స్థానిక శివాలయం రోడ్డులో ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయానికి విశిష్ట చరిత్ర ఉంది



సుమారు 185 సంవత్సరాలు విశిష్ట చరిత్ర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ఉంది. కర్రి వంశీకులు పాముల పుట్ట ఉన్న ప్రదేశంలో తాటాకు ఇళ్ల ఏర్పాటు చేసి పూజలు చేశారు. అనంతర కాలంలో మండపం తర్వాత ఆలయంగా రూపుదిద్దుకుంది. పిల్లలు పుట్టని వారు, పెళ్లిళ్లు కాని వారు, సర్పదోషం, కుజ దోషం ఉన్నవారు ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారని అంతేగాక రాహు,కేతులక పూజలు కూడజరుగుతాయి. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాలను విజయవంతం చేయాలని, భక్తులు స్వామి వారిని దర్శించి తరించాలని ఆయన కోరారు.

–ఆలయ కమిటీ ధర్మకర్త, రైతు నాయకుడు కర్రి సీతారామయ్య

ప్రవాహం లేని నీటినిల్వలు దోమలకు ఆవాసాలు


ఇంటి ఆవరణలో ఉన్న పాత టైర్లను తొలగింపజేస్తున్న సిబ్బంది

తణుకు అర్బన్: ప్రవాహం లేని నీటి నిల్వలు దోమలకు ఆవాసాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు 29వ వార్డు మల్లికాసుల ప్రాంతంలో బుధవారం గ్రౌండ్ లెవెల్ బ్రీడింగ్ సోర్సెస్, క్యూర్ కంట్రోల్ హైజీన్ మస్కిటో లార్వా డెన్సిటీ, కీటకజనిత వ్యాధులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛతతో కూడిన నీటి నిల్వల్లో మాత్రమే దోమలు గుడ్లు పెడతాయని ఆ గుడ్లు 8 నుంచి 10 రోజుల్లో దోమలుగా మారుతాయని స్పష్టం చేశారు. అందుకే వారానికోసారి ఇంటి పరిసరాల్లోని మొక్కల కుండీలు, రుబ్బురోళ్లల్లో నీటి నిల్వలు తొలగించాలని, తాగేసిన కొబ్బరిబొండాలు, పాత టైర్లు ఇంటి ఆవరణలో ఉంచకుండా బయట పారేయాలని సూచించారు. డ్రెయినేజీల్లో చెత్త, వ్యర్థాలు పారవేయరాదని, మీ ఇంటి చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు అందజేయలని కోరారు. ఈ సందర్భంగా జాగ్రత్తలు తెలిపే కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీ బి.వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్స్ ఎం.శ్రీనివాస్, ఎస్.తాతాజీ, అంగన్‌వాడీ టీచర్ వై.మహాలక్ష్మి, ఆశ కార్యకర్త కేఎస్‌కే మహాలక్ష్మి పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై దాడులు


తణుకులో బెల్ట్‌షాపు నిర్వాహకుడిని అరెస్టు చేసిన ఎక్సైజ్ సీఐ మణికంఠరెడ్డి


పరిమెళ్లలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

తణుకు అర్బన్: ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో బెల్ట్ షాపు నిర్వాహకుడిని అరెస్టు చేసి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ శాఖ సీఐ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు, బార్లను మూసివేసి సీజ్ చేయడంతో గ్రామానికి చెందిన గరగ శ్రీను ముందుగానే మద్యం సీసాలను వివిధ దుకాణాల నుంచి కొనుగోలు చేసి వీటిని అధిక ధరలకు అమ్ముతున్న కారణంగా వచ్చిన సమాచారం మేరకు ఆకస్మిక దాడి చేసినట్లు వివరించారు. మద్యాన్ని అక్రమంగా నిల్వచేసి అధిక ధరలకు విక్రయించాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్ఐ బి.లక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ ఎస్.అప్పలస్వామి, కానిస్టేబుల్ జి.గంగాధర్ పాల్గొన్నారు.

రెండు కేసులు నమోదు

తాడేపల్లిగూడెం: ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గూడెం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో బుధవారం అధికారులు నిర్వహించిన దాడుల్లో అక్రమంగా డ్యూటీ పెయిడ్ మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పెంటపాడు మండలం పరిమెళ్ల గ్రామంలో ఏపీ ఎన్ ఫోర్సుమెంటు అధికారులు ఇన్‌స్పెక్టర్ ఆర్ భోగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిపిన దాడిలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 48 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. గూడెం పట్టణ పరిధిలోని యాగర్లపల్లిలో గూడెం ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి పర్యవేక్షణలో జరిపిన దాడిలో ఒక వ్యక్తి దగ్గర నుంచి 09 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు మురళీమోహన్, దొరబాబులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి


తణుకులో పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్

తణుకు టౌన్: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తణుకు పట్టణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బానో పరిశీలించారు. గురువారం నిర్వహించే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తణుకు పట్టణంలోని జాస్తి సీతామహాలక్ష్మి బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను బుధవారం తాడేపల్లి గూడెం ఆర్డీవో పరిశీలించారు. తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లోని 1000మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల కోసం ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాడేపల్లిగూడెం నుంచి అన్ని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామగ్రిని తరలించినట్లు తెలిపారు. తణుకు మండలంలో మొత్తం 407 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈ పోలింగ్ ప్రక్రియ తహసిల్దార్‌ల పర్యవేక్షణలో ప్రశాంత నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆర్డీవో తెలిపారు.

తాడేపల్లిగూడెం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నిమిత్తం గూడెం రెవెన్యూ సబ్‌డివిజన్ పరిధిలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలింగ్ గురువారం జరగనుంది. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ జరగనుంది. పట్టణంలోని సుబ్బారావుపేట ఉన్నత పాఠశాలలో పోలింగ్ ఏర్పాట్లు చేశారు. ఈ కేంద్రంలో 377 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 198 మంది, మహిళలు 179 మంది ఉన్నారు. ఎన్నికల సామగ్రి స్థానిక ఆర్డీఓ కార్యాలయం నుంచి ఆర్‌డీఓ ఖతీబ్ కౌసర్ భానో పర్యవేక్షణలో సబ్ డివిజన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

మానవత సేవలు అభినందనీయం


మంచిలిలో విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

అత్తిలి: ఆపదలో ఉన్న వారిని గుర్తించి వారికి సహాయ సహకారాలు అందజేయడంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షుడు ముదునూరి బాలకృష్ణంరాజు అన్నారు. మంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న ఉడతల యమునా శ్రీలక్ష్మి ఇటీవల ప్రమాదంలో గాయపడటంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరపున రూ. 5 వేలు నగదును బుధవారం ఆమెకు అందజేసారు. ఇటీవల పక్షవాతానికి గురైన భద్రాచలం మురళీకృష్ణ అనే వ్యక్తికి వైద్యఖర్చుల నిమిత్తం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరపున రూ. 5 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ కొరిపల్లి హరి పాల్గొన్నారు.

పెన్నాడ హైస్కూల్ తనిఖీ

పాలకోడేరు: రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం ఇంచార్జి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్ ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా బుధవారం పెన్నాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు హెల్త్ కార్డులు పంపిణీ చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించింది. ఈ కార్యక్రమం సక్రమంగా జరుగుతుందా లేదా అని క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు ఏమైనా వ్యాధులు ప్రబలినట్లు గుర్తిస్తే వారిని ఏరియా ఆసుపత్రికి పంపించాలని పూర్తి వైద్యం ప్రభుత్వమే అందిస్తుందని గులాబ్ రాజ్ కుమార్ తెలిపారు.

ఘంటసాల మధుర పాటలు చిరస్మరణీయం



ఘంటసాల జయంతి కార్యక్రమంలో పాటలు ఆలపిస్తున్న గాయకులు

తణుకు టౌన్: తెలుగు సినీ సాహిత్యంలో ఘంటసాల పాడిన పాటలు చిరస్మరణీయమని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ ముళ్లపూడి రేణుక చెప్పారు. బుధవారం రాత్రి సినీ సంగీత గాయకుడు ఘంటసాల 102వ జయంతి ఘనంగా నిర్వహించారు. తణుకులోని ముళ్లపూడి తిమ్మరాజు స్మారక గ్రంథాలయంలో నిర్వహించిన ఘంటసాల సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో తణుకు పట్టణానికి చెందిన రాజు ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో ఘంటసాల పాటలను ఆలపించారు. ఈకార్యక్రమంలో గాయకులు ఆకుమర్తి రాజు, ఆర్ అనిత, వివిధ ప్రాంతాలకు చెందిన గాయకులు, సంగీత వాయిద్యకారులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్, లయన్స్ క్లబ్ చైర్మన్ వావిలాల సరళాదేవి, కే సూర్యనారాయణ, ఎం రవి రిజనాల్డ్, ఏవీఆర్ సుబ్రహ్మణ్యం, కొడమంచిలి జితేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో...

సినీ గాయకులు ఘంటసాల 102వ జయంతి వేడుకలు సాహితీ సంస్థ సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో పట్టణంలోని ఏకేటీపీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఘంటసాల పాడిన పాటల పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో సాహితీ సంస్థ అధ్యక్షుడు తాడినాడ భాస్కరావు, హెచ్ఎం తాళాబత్తుల రామకృష్ణ, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న మారుతీదేవి

తణుకు టౌన్: బాలికలలో విద్యను పెంపొందించడం ద్వారానే బాలికలు, మహిళలపై దాడులను అరికట్ట వచ్చని తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా సాధికార కన్వీనర్ ఏ మారుతీదేవి చౌదరి చెప్పారు. బుధవారం కళాశాలలో జరిగిన లింగ వివక్షత, మహిళలపై జరిగే దాడులు, వాటి నిర్మూలనలో బాలిక విద్య ఆవశ్యకత అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలపై నేటికి కొన్ని చోట్ల వివక్ష ఇంకా కొనసాగుతుందన్నారు. బాలికలు, మహిలపై జరుగుతున్న దాడులను, వివక్షను ఎదుర్కొనేందుకు విద్య చాలా అవసరమని చెప్పారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి భవిష్యత్‌లో స్థిర పడాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జీ ఇందిరా కుమారి, చాముండేశ్వరి దేవి, విద్యార్థినీలు పాల్గొన్నారు.